క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నాగారం : మండలంలోని 33/11కేవీ ఫణిగిరి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఈటూరు, ఫణిగిరి, మామిడిపల్లి, అనంతారం, మాలిపురం గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈఈ మహేంద్రకుమార్ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయా గ్రామాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలు



బొడ్రాయి వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

చివ్వెంల: మండల పరిధిలోని పాండ్యానాయక్ తండాలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ధరావతు భిక్షం నాయక్, హనుమా నాయక్, క్రిష్ణ నాయక్, బాబు నాయక్, వెంకన్న నాయక్ పాల్గొన్నారు.

రూ.205కోట్లు కేటాయించడం హర్షణీయం

తుంగతుర్తి : వరంగల్ జిల్లాలో మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం రూ.205 కోట్లు కేటాయించడం హర్షణీయమని బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ కత్తుల నరేష్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎయిర్ పోర్టు నిర్మాణంతో వరంగల్ జిల్లా ఎంతో అభివృద్ధి చెందనుందని తెలిపారు. తెలంగాణ ప్రజలు ప్రధాని మోదీకి రుణపడి ఉన్నారని అన్నారు.

పోలీస్ స్టేషన్‌కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు



ప్రశ్నాపత్రాలను భద్రపరుస్తున్న సిబ్బంది

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రానికి సంబంధించిన ప్రశ్నాపత్రాలు ఆదివారం పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. ఈ సందర్భంగా చీఫ్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ తేరాల ఉపేందర్ ఆధ్వర్యంలో వాటిని పోలీస్‌స్టేషన్‌లోని స్ట్రాంగ్ రూంలో భద్రపరిచారు. ఈ నెల ఐదో తేదీనుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని చీఫ్ సూపరింటెండెంట్ తెలిపారు.


యూరియా కోసం బారులు



పీఏసీఎస్ వద్ద బారులుదీరిన రైతులు

అర్వపల్లి : మండల పరిధిలోని తిమ్మాపురం పీఏసీఎస్‌కు ఆదివారం 444 బస్తాల యూరియా రాగా వివిధ గ్రామాల నుంచి రైతులు తరలివచ్చి క్యూలైన్‌లో బారులుదీరారు. దీంతో పీఏసీఎస్ సీఈఓ ఊర సత్యనారాయణ రైతులందరికీ యూరియా అందేలా పంపిణీ చేశారు. ఎప్పటికప్పుడు యూరియాను తెప్పిస్తున్నామని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది వెంకన్న, రైతులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వల పరిశీలన



కాల్వను పరిశీలిస్తున్న నాయకులు

నూతనకల్ : ఎస్సారెస్పీ కాల్వలను ఆధునీకరించి సాగునీటిని అందించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు పులుసు సత్యం ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో 69డీబీఎం కాల్వను పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పులసరి వెంకటముత్యం, భోనగిరి లింగయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తీర్చాలని వినతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని ఎస్సీ మాలకాలనీలో శాశ్వతంగా బోరు వేసి నీటి సమస్యను తీర్చాలని కాలనీవాసులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. అయితే కొద్ది రోజులుగా గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా తాత్కాలికంగా కాలనీకి నీటిని సరఫరా చేస్తున్నారు. నిరంతరం నీళ్లు వచ్చేలా కాలనీలో కొత్తగా బోరు వేయించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. ఎన్నికల కోడ్ ముగిశాక శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గోపి తెలిపారు.

రోడ్లు ఛిద్రం.. మరమ్మతులు శూన్యం



గుంతలమయమైన బొల్లంపల్లి రోడ్డు



అర్వపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు



చాకలిగూడెం-కొత్తగూడెం మధ్య..



అర్వపల్లి-కొమ్మాల రోడ్డు ఇలా..

- అధ్వానంగా కొత్తగూడెం, వేల్పుచర్ల, బొల్లంపల్లి రోడ్లు
- అర్వపల్లి-కొమ్మాల రహదారి పరిస్థితి కూడా అంతంత మాత్రమే..
- కొత్తగూడెం రోడ్డు బీటీకి నిధులు మంజూరైనా ప్రారంభం కాని పనులు

అర్వపల్లి : గ్రామీణ ప్రాంత రహదారులు ఛిద్రమై రాకపోకలకు ప్రజలు అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా రోడ్ల మరమ్మతులు జరగక గ్రామీణులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొన్ని రోడ్ల మరమ్మతుకు నిధులు మంజూరైనా టెండర్లకు కాంట్రాక్టర్లు ముందుకు రాక పనులు మొదలుకాని పరిస్థితి నెలకొంది. మరికొన్ని రహదారుల మరమ్మతులకు నిధులు సకాలంలో మంజూరు కాని పరిస్థితి ఏర్పడింది. జాజిరెడ్డిగూడెం మండలంలోని పలురోడ్ల పరిస్థితి ఇలాగే ఉంది.

నిధులు మంజూరైనా..

జాజిరెడ్డిగూడెం మండలంలోని అర్వపల్లి నుంచి కొత్తగూడెం వెళ్లే రోడ్డు బీటీ రెన్యూవల్‌కు రూ.71లక్షలు మంజూరయ్యాయి. ఈ పనులకు సంబంధించి ఇప్పటికే 8సార్లు పంచాయతీరాజ్ అధికారులు టెండర్లను ఆహ్వానించారు. కాగా అసెంబ్లీ ఎన్నికలకు ముందు సూర్యాపేటకు చెందిన ఓ కాంట్రాక్టర్ టెండర్ వేసి కాంట్రాక్ట్ దక్కించుకున్నారు. అయితే పనులు మాత్రం ప్రారంభించలేదు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలకే పరిమితమా..!

365 హైవే వెంట ఉన్న బొల్లంపల్లి స్టేజీ నుంచి పర్సాయపల్లి గ్రామం వరకు రోడ్డు బీటీకి ఆర్అండ్‌బీ నుంచి రూ.8.30కోట్లతో ప్రతిపాదనలు పంపారు. కానీ ఇంత వరకు నిధులు మంజూరు కాలేదు. అర్వపల్లి నుంచి కాసర్లపహాడ్ మీదుగా కొమ్మాల వరకు 9కి.మీ రోడ్డు బీటీ రెన్యూవల్‌కు రూ.3కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు వెళ్లాయి. కాగా వేల్పుచర్ల రోడ్డు బీటీకి కూడా గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి నిధులు మంజూరైన రోడ్ల పనులను వెంటనే ప్రారంభించి, ప్రతిపాదనలు వెళ్లిన రోడ్లకు నిధులు మంజూరు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నాం



మాగ్రామ రోడ్డు బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరై ఏళ్లు కావొస్తున్నా పనులు జరగడం లేదు. ప్రస్తుతం ఉన్న రోడ్డు పూర్తిగా దెబ్బతిని నడిచి వెళ్లలేని విధంగా మారింది. రాత్రయితే ఈ రోడ్డుపై ఎటూ వెళ్లలేం.

–శీలం రాము, కొత్తగూడెం

నిధులు మంజూరు చేసి బీటీ నిర్మించాలి



బొల్లంపల్లి నుంచి పర్సాయపల్లి వరకు రోడ్డు బీటీకి రూ.8.30 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ నిధులను వెంటనే మంజూరు చేసి బీటీ నిర్మాణం చేపట్టాలి. ప్రస్తుతం దారి పూర్తిగా గుంతలతో నిండి రాకపోకలకు నిత్యం అవస్థలు పడుతున్నాం.

–కేసాని రాహుల్, బొల్లంపల్లి

ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలి



సచ్చిదానంద వేంకటేశ్వర ఆశ్రమ వార్షిక వేడుకలో పాల్గొని పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

మద్దిరాల : ప్రతి ఒక్కరూ భక్తి భావం కలిగి ఉండాలని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. ఆదివారం పోలుమల్ల గ్రామంలోని శ్రీసచ్చిదానంద వేంకటేశ్వరస్వామి శ్రీబోధానంద కాయిత వెంకటాచార్యుల ఆశ్రమ 18వ వార్షికోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు వాసిరెడ్డి రాంరెడ్డి, అదే గ్రామానికి చెందిన ఆకుల మనీషా ఇటీవల మృతి చెందడంతో వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వల్లపు వాణి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, అభిషేక్‌రెడ్డి, పాక అమృతమల్లు, పచ్చిపాల సుమతీ వెంకన్న, గ్రామ శాఖ అధ్యక్షుడు ఏలేటి శ్యాంరెడ్డి, చామకూరి శ్రీనివాస్, చిలివేరు లింగరాజు, రేసు లింగయ్య, ఎల్లు అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీటి విడుదలలో విఫలం

పెన్‌పహాడ్ : వర్షాభావ పరిస్థితులతోపాటు, శ్రీరాంసాగర్ ఆయకట్టుకు వారబందీ ప్రకారం సకాలంలో నీటిని విడుదల చేయడంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు విమర్శించారు. ఆదివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. శ్రీరాంసాగర్ కాలువ ద్వారా నీరు చివరి ఆయకట్టు వరకు వస్తాయనుకున్న రైతులకు తీవ్ర నిరాశే మిగిలిందని తెలిపారు. రానున్న రోజుల్లో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా సమస్యలపై దశల వారీగా పోరాటాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, షేక్ సైదా, నర్సింహారావు, ధనియాకుల శ్రీకాంత్‌వర్మ, జ్యోతి, జూలకంటి విజయలక్ష్మి, గుంజా వెంకటేశ్వర్లు, మేకనబోయినసైదమ్మ, ఖాజాబీ, సుశీల తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలని ధర్నా



పొలాల వద్ద ధర్నా చేస్తున్న రైతులు

చివ్వెంల : ఎండిపోయిన పంట పొలాలకు ప్రభుత్వం నష్ట పరిహారం అందించాలని గ్రామీణ పేదల సంఘం జిల్లా కార్యదర్శి కోణకంచి వీర భద్రయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల పరిధిలోని మొగ్గయ్యగూడెంలో ఎండిపోయిన పొలాలను ఆ సంఘం ఆధ్వర్యంలో సందర్శించి పరిశీలించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఎండిపోతున్న పొలాలకు వెంటనే ఎస్సారెస్పీ ద్వారా నీటిని అందించాలని డిమాండ్ చేశారు. ఎకరాకు రూ.30 వేల నష్ట పరిహారం అందించాలని అన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాష్పంగు సునీల్, వాసు, రైతులు అవిమల్ల వెంకన్న, నారాయణ రెడ్డి, భుక్యా వెంకన్న, వెంకట్‌రావు, సుమన్, అశోక్, వాల్య, లాలు, ప్రసాద్, చక్రు పాల్గొన్నారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి

నూతనకల్ : కేంద్ర ప్రభుత్వం మిర్చి రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొల్క సైదులు యాదవ్ కోరారు. ఆదివారం నూతనకల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మిరప పంటలకు తెగుళ్లు సోకి దిగుబడులు తగ్గాయని అన్నారు. చివరకు చేతికందిన పంటకు కూడా కేంద్రం సరైన ధరను చెల్లించకపోవడం వల్ల రైతులకు నష్టాలే మిగిలాయని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి క్వింటాకు రూ.20వేల నుంచి రూ. 25వేలు చెల్లించి మిర్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కొరివి గంగయ్య, బంటు బద్రి, వాసు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కుటుంబాలను ఆదుకోవాలి

అర్వపల్లి : ఎస్ఎల్‌బీసీ టన్నెల్ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. ఆదివారం జాజిరెడ్డిగూడెంలో విలేకరులతో మాట్లాడారు. ఈ ఘటనపై ప్రభుత్వం విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ టన్నెల్ ప్రమాదంలో ఆరుగురు కార్మికులు, ఇద్దరు ఇంజనీర్లు ప్రమాదానికి గురై పది రోజులు గడిచినా తక్షణ చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించారు. ఈ టన్నెల్ కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కారణంగా 8మంది సమాధి అయ్యారని చెప్పారు. ఒక్కో కార్మికుడి కుటుంబానికి రూ. కోటి చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే ఆ కుటుంబంలో ఒక్కొక్కరికి ప్రభుత్వం ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు లింగయ్య, మధుకర్, బయ్యన్న, సోమన్న, ధర్మాజీ పాల్గొన్నారు.

నాగారం : శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) సొరంగ మార్గంలో ప్రమాదవశాత్తు పైకప్పు కూలి మరణించిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర నాయకుడు తడకమల్ల సంజీవ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. గత పాలకుల అసమర్థత, నేటి పాలకుల నిర్లక్ష్యం, అధికారుల ముందు చూపు లేకపోవడం, కాంట్రాక్టర్‌ల నిర్లక్ష్యం కారణంగానే ఎనిమిది మంది ప్రాణాలు పోయాయని, ఈ ఘటనపై పూర్తి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఏఐకేఎంఎస్ నాయకులు సంపెట కాశయ్య, యానాల సుధాకర్‌రెడ్డి, పోలెబోయిన కిరణ్, కృష్ణమూర్తి, బడేసాబ్ పాల్గొన్నారు.

సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

నాగారం : మండల పరిధిలోని డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త వంపు శ్రావణ్‌కుమార్‌తోపాటు మరికొంత మంది కార్యకర్తలు ఆదివారం సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపెట కాశయ్య, మాజీ సర్పంచ్ యానాల సుధాకర్‌రెడ్డిలు పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. అధికార పార్టీని వీడి పలువురు కార్యకర్తలు న్యూడెమోక్రసీలో చేరడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు సంపెట కృష్ణమూర్తి, కాసం వీరయ్య, దండోలు ధనుంజయ్, లింగయ్య, ఎస్‌డీ బడేమియా, సంజీవ, లింగారెడ్డి, సైదులు, గణేష్, విక్రం, నాగరాజు, భాస్కర్, జానీ తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులకు వ్యతిరేకంగా పోరాడాలి



మాట్లాడుతున్న మారసాని చంద్రకళ

భానుపురి : మార్చి 8వ తేదీ వరకు జరిగే అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ సభలను జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా నిర్వహించాలని పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ అన్నారు. ఆదివారం స్థానిక లెనిన్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలపై నిరంతరం పోరాడాలని తెలిపారు. రోజురోజుకూ మహిళలపై దాడులు తీవ్రతరం అవుతున్నాయని, పరువు హత్యలు విచ్చలవిడిగా పెరుగుతున్నాయని అన్నారు. స్త్రీ, పురుష సమానత్వం నేటికీ సాధించలేక పోతున్నామని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా.. వివక్ష మాత్రం కొనసాగుతూనే ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షులు సూరం రేణుక, సహాయ కార్యదర్శి సంతోషి మాత, కోశాధికారి జయమ్మ, జిల్లా నాయకులు ఐతరాజు పద్మ తదితరులు పాల్గొన్నారు.

మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి



సూర్యాపేట టౌన్ : శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీలు



అర్వపల్లి : ఎంపీడీఓ కార్యాలయంలో శ్రీపాదరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

సూర్యాపేట టౌన్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వ జయంతి వేడుకలను ఆదివారం సూర్యాపేట జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఆదేశాల మేరకు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వరరావు, ఏఆర్ అదనపు ఎస్పీ జనార్దన్‌రెడ్డి, ఆర్ఎస్ఐలు సురేష్, రాజశేఖర్, సాయిరాం పాల్గొన్నారు.

అర్వపల్లి : ఉమ్మడి రాష్ట్ర మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఆదివారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ టి. గోపి, సీనియర్ అసిస్టెంట్ చక్రహరి నర్సింహరాజు, జూనియర్ అసిస్టెంట్ శిల్పిక, ఈపీఓ సంతోష, సబార్డినేట్ మర్రి రామ్మూర్తి, వల్లాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సస్పెన్షన్‌ను ఉపసంహరించుకోవాలి

తిరుమలగిరి : కాంగ్రెస్ పార్టీ తీన్మార్ మల్లన్నపై సస్పెన్షన్ వేటు ఎత్తివేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుమలగిరిలో బీసీ ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తీన్మార్ మల్లన్న ఎంతో కృషి చేశారని అన్నారు. గత ప్రభుత్వ పాలనపై ప్రశ్నించి, ప్రజా సమస్యలపై గళమెత్తిన నాయకుడు తీన్మార్ మల్లన్న అన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు వంగరి బ్రహ్మం, మురళీ, ఉపేందర్ గౌడ్, రామ్మూర్తి, సూర్య నారాయణ, వెంకన్న, భిక్షం పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలగిరి : వెలిశాల గ్రామానికి చెందిన సట్టు బాలనర్సయ్య ఇటీవల మృతి చెందారు. మృతుడి కుటుంబ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు కుంభం సతీష్ గౌడ్ ఆదివారం రూ.5000, 50 కిలోల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిలుకల శ్రీశైలం యాదవ్, వీర సోములు గౌడ్, సత్తయ్య, కాంతయ్య, రమేష్, యాకన్న, వీరయ్య, వెంకటయ్య, చిన్న గౌడ్, అశోక్ పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్) : ఏనుబాముల గ్రామానికి చెందిన చింతకుంట్ల సుధాకర్ ఇటీవల మృతి చెందారు. దీంతో 2002 బ్యాచ్ 10వ తరగతి మిత్రులు ఆదివారం మృతుడు సుధాకర్ కుటుంబానికి రూ.18,000 ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మిత్రులు ఆంజనేయులు, సైదులు, మల్లేష్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికుడి కుటుంబానికి పరామర్శ

అర్వపల్లి: సీతారాంపురం గ్రామానికి చెందిన గ్రామ పంచాయతీ కార్మికుడు బందెల చినయల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబానికి అదే గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ బందెల యాదగిరి–అరుణ దంపతులు రూ.10వేల ఆర్థికసాయాన్ని అంబేద్కర్ ఆర్ట్స్ అసోసియేషన్ జాతీయ ఉపాధ్యక్షుడు బందెల అర్వపల్లి ద్వారా అందించారు. ఈ కార్యక్రమంలో బందెల శశికాంత్, చినవెంకన్న, పరశురాములు, అంజయ్య, తీగల వీరయ్య, ఎల్లేష్ పాల్గొన్నారు.

గోవర్ధనమ్మకు నివాళి

పెన్‌పహాడ్ : పౌరాణికం, పద్య నాటకాల్లో వివిధ పాత్రలు పోషించి జీవం పోసిన ఘనత చల్లా గోవర్ధనమ్మకు దక్కిందని నాటక సమాజాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు గిలకత్తుల పుల్లయ్యగౌడ్ అన్నారు. ఆదివారం పొట్లపహాడ్‌లో ఆమె చిత్రపటానికి నివాళులర్పించి, కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో ధనియాకుల సత్యనారాయణ, దాచేపల్లి లక్ష్మి, వెంకటేశ్వర్లు, గజ్జెల ధర్మారెడ్డి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఆహ్వానం



మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డికి ఆహ్వానం అందజేస్తున్న కమిటీ చైర్మన్ రాజబాబురెడ్డి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి, కాంగ్రెస్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ దామోదర్‌రెడ్డి

సూర్యాపేట : మున్సిపల్ పరిధిలోని పిల్లలమర్రిలో ఈ నెల 10 నుంచి 15వ తేదీ వరకు జరిగే శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించి కమిటీ చైర్మన్ గూకంటి రాజబాబురెడ్డి ఆదివారం మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డికి ఆహ్వానం అందించారు. 13వ తేదీన జరిగే స్వామివార్ల కల్యాణ మహోత్సవానికి జగదీష్‌రెడ్డి–సునీత దంపతులు హాజరుకావాలని కోరారు. ఆయన వెంట రాపర్తి మహేష్ కుమార్, డైరెక్టర్లు మంగపండ్ల మల్లికార్జున్, చెరుకుపల్లి బంగారి, పెద మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

పిల్లలమర్రిలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను మాజీ మంత్రి, కాంగ్రెస్ సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఏఐసీసీ సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యులు, పబ్లిక్ క్లబ్ కార్యదర్శి కొప్పుల వేణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సువెన్ ఫార్మా ఆధ్వర్యంలో వైద్యశిబిరం



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సూర్యాపేట : ఉచిత వైద్యశిబిరాన్ని సువెన్ ఫార్మా పరిసర ప్రాంత ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని సువెన్ ఫార్మా అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ బాబు అన్నారు. ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కువ మంది డయాబెటిస్, బీపీ లాంటి జీవనశైలి వ్యాధులతో ఇబ్బంది పడుతుండటం బాధాకరమన్నారు. వైద్య శిబిరంలో నెలకు సరిపడా మందులు పూర్తిగా ఉచితంగా పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఉచిత వైద్యశిబిరంలో జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, ఆర్థోపెడిక్ డాక్టర్లు అందుబాటులో ఉంటారని అన్నారు. కార్యక్రమంలో ఫిజీషియన్ డాక్టర్ సాయికుమార్, ఎండీ గైనకాలజిస్ట్ డాక్టర్ ఎంఎస్, ఆర్థోపెడిక్ డాక్టర్ సుజిత్, సీఎస్ఆర్ ఇన్‌చార్జ్ పీఎస్ఎన్ మూర్తి, వరప్రసాద్‌రెడ్డి, హెచ్ఆర్ హెడ్ వెంకటరమణ, పీవీ రమణ, ఎంవీ రమణ, డిప్యూటీ మేనేజర్ సైదులు, క్యాప్టన్ మేనేజర్ జీవన్ నాయక్, సువెన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వవిద్యార్థుల సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

ఆత్మకూర్ (ఎస్) : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–05 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. 20 ఏళ్ల తర్వాత కలిసిన వారంతా ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు.

రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

భానుపురి : ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో జరిగే దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర సమావేశాలను జయప్రదం చేయాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏసురత్నం, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. నేటికీ దళితులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని అన్నారు. సమానత్వం, సామాజిక న్యాయం, కుల నిర్మూలన కాగితాలకే పరిమితమైందని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్, తుంగతుర్తి మండల కార్యదర్శి పాల్వాయి పున్నయ్య, ఏడిండ్ల అశోక్, రేమిడాల రాజు, గురు స్వామి పాల్గొన్నారు.

ధ్యానోత్సవాలకు తరలిరావాలి

అర్వపల్లి : అర్వపల్లిలో హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ, శ్రీరామచంద్ర మిషన్‌ల ఆధ్వర్యంలో సోమవారం నుంచి జరిగే ఉచిత యోగా–ధ్యానోత్సవాలకు ప్రజలు తరలిరావాలని సూర్యాపేట హార్ట్‌ఫుల్‌నెస్ సంస్థ సెంటర్ ఇన్‌చార్జ్ ఎస్.గోవర్ధనగిరి కోరారు. ఆదివారం అర్వపల్లిలో పలువురికి ఆహ్వాన పత్రికలను అందజేశారు. స్థానికంగా మూడు రోజుల పాటు ఈ శిక్షణ కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. అర్వపల్లిలో ప్రతి ఆదివారం ధ్యాన కార్యక్రమం జరుగుతుందని, ఇందు కోసం ప్రత్యేకంగా ధ్యాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రశిక్షకులు ముసునూరి వెంకటరంగారావు, నూకల ఉపేందర్, అభ్యాసకులు శేఖర్, వెంకటేష్, దడిపల్లి వెంకట్, మేకల సత్యనారాయణ, ఉష, వెన్నెల, వెంకట్ రెడ్డి, రంజిత్, జ్యోతి, రజిని, ఉమ, లక్ష్మి, వీరయ్య, వనం రమేష్, వేణు, సతీష్, సందీప్ పాల్గొన్నారు.

అందాల పోటీలను వ్యతిరేకించాలి

భానుపురి : తమ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరింపజేసుకోవడానికి కార్పొరేట్ శక్తులు, ప్రభుత్వాలు కలిసి హైదరాబాద్ వేదికగా నిర్వహించ తలపెట్టిన ప్రపంచ అందాల పోటీలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు అనసూయ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దేశానికి స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు దాటినా స్త్రీ, పురుషుల మధ్య సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వం లేకపోవడం దారుణమన్నారు. ఈ సభలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి కంచర్ల నరసమ్మ, సహాయ కార్యదర్శి రామలింగమ్మ, పులుసు సుజాత, జిల్లా కమిటీ సభ్యులు జయలక్ష్మి, జయసుధ, ఖాతా లింగమ్మ, సంతోష, సామ ఉపేంద్ర, నాగలక్ష్మి, నవ్య, మహేశ్వరి, శృతి, పావని తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అనసూయ